క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాలటౌన్: ప్రయాణికుల సౌకర్యార్థం, మెరుగైన సేవలు అందించేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య సెల్ 9959225800 నంబర్‌కు ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

నంద్యాల(న్యూటౌన్): రైతు, కార్మిక, మహిళల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు రవిరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వంతో ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు.అలాగే బీజేపీకి మద్దతు ఇస్తున్న పార్టీలను ఓడించాలని కోరారు.

వైభవంగా స్వాతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి అమ్మవార్ల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనం అనంతరం పట్టువస్త్రాలుగా అలంకరించారు. మహానైవేద్యాన్ని సమర్పించి మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం


స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో బుధవారం శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం వేడుకగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీఅభయాంజనేయస్వామి వారి శిలామయ విగ్రహ వాయు ప్రతిష్ఠ మహోత్సవం, త్రయాహ్నిక ప్రతిష్ఠ మహోత్సవం చేపట్టారు. ఇందులో భాగంగా ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో జరిపించారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి


ప్రచారం నిర్వహిస్తున్న శిల్పారెడ్డి

గోస్పాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందని నంద్యాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సోదరి శిల్పా రెడ్డి అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో బుధవారం ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నంద్యాల ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. నాయకులు జనార్దన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

నంద్యాల(అర్బన్)/ గోస్పాడు : నంద్యాల మండలం మిట్నాల, భీమవరం గ్రామాలకు చెందిన 12 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. అలాగే.. గోస్పాడు మండలం సాంబవరం గ్రామానికి చెందిన 12 వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ నాగఅనసూయకు అందజేశారు.

విద్యార్థులకు అభినందన

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎన్‌జీఓ కాలనీలో నున్న శ్రీగురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం 31మంది పదవ తరగతి విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. చైర్మన్ దస్తగిరిరెడ్డి, డైరెక్టర్ షేక్షావలిరెడ్డి విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

నంద్యాల టౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర జీవనం సాధ్యమని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే 90 శాతం రోగాలు దరిచేరవని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25 తేదీన ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కామేశ్వర రావు ఉన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

రుద్రవరం: రోడ్డుపై ట్రాక్టర్ ఉంచడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, మరోచోట ఉంచుకోవాలని చెప్పిన మహిళపై దాడి చేసిన ఘటన మండలం కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ తెలిపిన వివరాలు.. స్థానిక దాసరిపల్లె కాలనీకి చెందిన బషీరున్ అనే మహిళ ట్రాక్టర్ అడ్డంగా ఉందని చెప్పడంతో మహాలక్ష్మి, ఈర య్య, మాలక్ష్మి, వెంకటేశ్వర్లు, మేకల తిరుమలమ్మ ఆమెపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ చెప్పారు.


ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా వెళ్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి


నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

అభిమానగణం అండగా..

- నంద్యాల ఎంపీ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందరెడ్డి నామినేషన్
- నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ర్యాలీ
- తరలివచ్చిన రైతన్నలు

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు వెంట రాగా.. నంద్యాల ఎంపీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందరెడ్డి బుధవారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. జిల్లా నలుమూలల నుంచి స్వచ్ఛందంగా సొంత కార్లు, ట్రాక్టర్లు, బైక్‌లపై రైతులు, అన్ని వర్గాల ప్రజలు నంద్యాల పట్టణానికి భారీ సంఖ్యలో చేరుకున్నారు. జనసందోహంతో పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్థానిక పద్మావతినగర్ సర్కిల్‌లో ఉన్న పోచా కార్యాలయం వద్ద ఉదయం నుంచే సందడి నెలకొంది. భారీ సంఖ్యలో కార్యకర్తలతో ర్యాలీ ప్రారంభించారు. నామినేషన్‌కు వెలుతున్న పోచా బ్రహ్మానందరెడ్డికి ప్రజలు అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ, టపాకాయాలు పేల్చి , భారీ గజమాలలతో ఆల్ దబెస్ట్ తెలిపారు. పట్టణంలో నిర్వహించిన ర్యాలీ పండుగ వాతావరణాన్ని తలపించింది. పద్మావతినగర్ నుంచి టెక్కె మార్కెట్‌యార్డ్ మీదుగా సాయిబాబానగర్ సర్కిల్‌ను దాటుకుని నూనెపల్లి బ్రిడ్జిపై నుంచి కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. పోచా నామినేషన్ సందర్భంగా నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పోచాను కలిసి అభినందించారు. ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు డాక్టర్ నౌమన్, ప్రముఖ పారిశ్రామికవేత్త కల్లూరి రామలింగారెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ కార్యాలయంలో నంద్యాల పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులుకు పోచా తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనపై నమ్మకం ఉంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు మరోసారి అవకాశమివ్వడం సంతోషంగా ఉందన్నారు. నంద్యాల పార్లమెంట్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు అహర్నిశలు కృషి చేస్తానని, ఇందుకు మరోసారి తనను ఓటుతో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.


గజమాలతో పోచా బ్రహ్మానందరెడ్డికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

వారికి ఓటు అడిగే హక్కులేదు


ఓటర్లను ఓటు అభ్యర్థిస్తున్న శిల్పా రవి, కౌన్సిలర్ నాగిని రవిసింగారెడ్డి

బొమ్మలసత్రం: పేద ప్రజల అభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం ఇళ్ల పట్టాలు, మెడికల్ కళాశాల మంజూరు చేసినప్పుడు కోర్టుకు వెళ్లి అడ్డుకున్న వారికి ప్రజలను ఓటు అడిగే హక్కు లేదని నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 36వ వార్డు కౌన్సిలర్ నాగిని రవిసింగారెడ్డి ఆధ్వర్యంలో శిల్పా రవి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో నాడు నేడు ద్వారా పాత ఆసుపత్రి, పాఠశాలలు ఆత్యాధునికంగా రూపుదిద్దుకున్నాయన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఒక్కనాడైనా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను పరిష్కరించారా అని ప్రశ్నించారు. తాము మాత్రం గెలిచినప్పటి నుంచి నేటి వరకు నిత్యం ప్రజాక్షేత్రంలో ఉన్నామని, ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుని పరిష్కరించామని, ఇందుకు ప్రజలే సాక్షి అని చెప్పారు. శిల్పా రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, నాయకులు విజయేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, జయప్రకాష్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, చల్లా సత్యం, పుల్లయ్య, రవి, శేసు, సుబ్బయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వానికే పట్టం కట్టండి

పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని, మరోసారి గెలిపించాలని నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కోరారు. పట్టణ శివరు ప్రాంతాలైన క్రాంతినగర్, రైతునగర్, శిల్పానగర్ ప్రాంతాల్లో కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు రామసుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాజు, కృష్ణారెడ్డి, కె కృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీదేవి, మున్న, వెంకటేశ్వర్లు, చలమయ్య, అల్లూరయ్య, బసిరెడ్డి, రంగనాయకులు, ప్రభాకర్‌రెడ్డి, సుభాన్ పాల్గొన్నారు.


శిల్పా రవిని ఆప్యాయంగా పలకరిస్తున్న వృద్ధురాలు

వైఎస్సార్‌సీపీతోనే భవిష్యత్

బొమ్మలసత్రం: ఐదేళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపిస్తే భవిష్యత్ తరాలు సైతం సంతోషంగా ఉంటాయని నాగిని రవిసింగారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 33వ వార్డులో కౌన్సిలర్ ఎద్దు మనోరంజని, రవితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అవి కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా శిల్పా రవి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. డాక్టర్ మనోజ్, శేఖర్, ప్రవీణ్, ప్రసన్నరావు పాల్గొన్నారు.


వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న నాగిని రవిసింగారెడ్డి

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

నంద్యాల(అర్బన్): నంద్యాల అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులుగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని మాజీమంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సతీమణి రమాదేవి కోరారు. మండలంలోని మునగాల గ్రామం వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉశేన్‌రెడ్డి, నాగపుల్లయ్యతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గాన్ని ఈ ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశారని వారిని మళ్లీ గెలిపిస్తే మరింతగా అభివృద్ధి చేస్తారని చెప్పారు.


ప్రచారంలో పాల్గొన్న రమాదేవి

వైభవంగా ధ్వజస్తంభాల ప్రతిష్ఠ

నంద్యాల (వ్యవసాయం) : మెయిన్‌బజార్‌లోని సుంకులమ్మ వీధిలోనున్న శ్రీసుంకులాపరమేశ్వరి ఆలయంలో ధ్వజ స్తంభాల ప్రతిష్ఠోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా వేదపండితులు ప్రవీణ్, వేణుగోపాల్, శివశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం , గణపతి, లక్ష్మీ, వాస్తు, రక్ష, నవగ్రహ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. నూతన ధ్వజ స్తంభాలకు ప్రత్యేక పూజల అనంతరం శివాలయం , రామాలయాలకు సంబంధించిన ధ్వజ స్తంభాలను ప్రతిష్ఠించారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ కార్యక్రమానికి శిరిగిరి రామకృష్ణ రూ.2 లక్షల విరాళం అందజేశారని చెప్పారు. మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ చిమ్మానాగన్న, వెంకటసుబ్బయ్య, రామకృష్ణ, మురళీ పాల్గొన్నారు.


శిల్పా మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీలో చేరిన అబ్దుల్ రావుఫ్ తదితరులు

వైఎస్సార్‌సీపీలో చేరిక

బొమ్మలసత్రం: కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నంద్యాల పట్టణ సెక్రెటరీ అబ్దుల్ రావూఫ్ బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి నివాసంలో 24వ వార్డు ఇన్‌చార్జ్ రహంతుల్లా ఆధ్వర్యంలో అబ్దుల్ రావుఫ్‌తో పాటు ఎంఆర్ కేబుల్ ఆపరేటర్ నూర్‌బాషా, హనీఫ్, అబ్దుల్ జబ్బార్, రఫి, యాసిన్, హనీఫ్ హుసేన్, జుబేర్, మహమ్మద్ హనీఫ్, బాషా, రసూల్‌తో పాటు 50 కుటుంబాలకు మోహన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.




ఎస్‌వీ జగన్, రామలింగారెడ్డి, బాబులాల్‌తో కలిసి ఆర్‌ఓ కార్యాలయంలోకి వెళ్తున్న బిజేంద్రారెడ్డి, ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

అభిమాన తరంగం తోడు రాగా..

- ఆళ్లగడ్డ అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి గంగుల నాని నామినేషన్
- జల కెరటంలా తరలివచ్చిన జనసందోహం
- పట్టణంలో పండుగ వాతవరణం
- అడుగడుగునా క్రేన్‌లతో స్వాగత గజమాలలు
- ఎస్‌వీ జగన్, డాక్టర్ రామలింగారెడ్డి, బాబులాల్‌తో కలిసి ఆర్‌ఓకు నామినేషన్ పత్రాల అందజేత

మరో మూడు వారాల్లో జరగనున్న ఎన్నికల సంగ్రామానికి వైఎస్సార్‌సీపీ సైన్యం 'మేమంతా సిద్ధం' అంటూ గొంతెత్తి నినదించారు. ఎన్నికల పోరులో తొలి ఘట్టమైన నామినేషన్ ప్రక్రియకు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. దీంతో పట్టణ వీధులు జనసంద్రంగా మారాయి. వైఎస్సార్ సీపీ జెండా రెపరెపల నడుమ భారీ ర్యాలీగా గంగుల బిజేంద్రారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా బుధవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. జన తరంగాన్ని చూసి గెలుపు నల్లేరు మీద నడకేనని తేలిపోయింది.


గంగుల నామినేషన్ కార్యక్రమానికి హాజరైన అశేష జనవాహిని

ఆళ్లగడ్డ: నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి నామినేషన్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా సాగింది. నియోజకవర్గంలోని ఆరు మండలాలు, మున్సిపాలిటీ పరిధి నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు, ప్రజల ఆశీస్సులతో తన నామినేషన్ పత్రాలను ఆర్ఓ మల్లికార్జునరెడ్డికి అందించారు. అంతకు ముందు వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, గంగుల మనోహర్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు బాబులాల్, భూమా కిశోర్‌రెడ్డి, గంగల విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

మిన్నంటిన జగన్నినాదం..

నామినేషన్ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఉదయం ఇంట్లో పూజలు నిర్వహించిన అనంతరం పార్టీ కార్యాలయం చేరుకుని అక్కడ సర్వమత ప్రార్థనలు నిర్వహించి మతాధిపతుల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ప్రత్యేక వాహనంలో నాలుగురోడ్ల కూడలికి చేరుకుని అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పాతబస్టాండు మీదుగా సంతమార్కెట్ వరకు వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. తరలివచ్చిన వేలాది మంది నినదించిన జై జగన్ నినాదంతో పట్టణం ప్రతిధ్వనించింది. సుమారు 3 గంటలు పాటు ర్యాలీ కొనసాగింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా కార్యర్తలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. దారివెంట బారీ క్రేన్‌ల సాయంతో భారీ గజమాలలతో గంగులకు ఘన స్వాగతం పలికారు.

రుద్రవరం: వైఎస్సార్‌సీపీ ఆళ్లగడ్డ అసెంబ్లీ అభ్యర్థిగా గంగుల బిజేంద్రారెడ్డి బుధవారం నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి జనం అధిక సంఖ్యలో తరలివెళ్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నామినేషన్ సమాచారం ముందుగానే తెలియడంతో మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు వాహనాల్లో ఆళ్లగడ్డకు తరలివెళ్లారు.

మరోసారి ఆశీర్వదించండి..

గత ఎన్నికల్లో ఆశీర్వదించినట్లే మరోసారి భారీ మెజార్టీతో ఓట్లతో ఆశీర్వదించండి.. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ అండగా ఉంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తా. వ్యవసాయ, అనుబంధ రంగాలను మరింత అభివృద్ధి చేసేందుకు ఆళ్లగడ్డలో ఆగ్రో హబ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా, రైతులకు చివరి ఆయకట్టుకు సైతం నీరు సమృద్ధిగా పారేందుకు తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు లైనింగ్ వేయిస్తా, ఆళ్లగడ్డను ప్రశాంతతకు మారుపేరుగా మారుస్తా.

– గంగుల బిజేంద్రారెడ్డి

నరకడానికా, చంపడానికా అధికారం?

ఎక్కడైనా ఎన్నికల సమయంలో అభివృద్ధి చేస్తాం అధికారం ఇవ్వండని అడగడం సహజం . కానీ ఇక్కడ ప్రతిపక్ష పార్టీకి చెందినవారు మాత్రం.. అధికారంలోకి వస్తే నరుకుతాం, చంపుతాం అని.. అందరి పేర్లు రాసిపెట్టుకున్నామని బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటు. మనుషులను చంపడానికే అధికారంలోకి రావలనుకోవడం ఎంతవరకు సబబో చెప్పాలి. నామీద కేసులు పెట్టారని మొసలి కన్నీరు కారుస్తున్నారు.. ఆ కేసులు ఏమైనా రాజకీయంగా పెట్టిన కేసులా.. మీరు చేసిన అక్రమాలు, దౌర్జన్యాలపై బాధితులు పెట్టిన కేసులే కదా.. అవి కూడా పక్క రాష్ట్రాల్లో నమోదయ్యాయని. ఇందుకు మాపై పడి ఏడవడం దేనికి. ప్రజలంతా గమనిస్తున్నారు. ఎవరేమిటో రేపటి ఎన్నికల్లో ఫలితాలతో సమాధానమిస్తారు. ఐదేళ్లుగా ఆళ్లగడ్డ ప్రశాంతంగా ఉంది. రైతులు సమృద్ధిగా పంటలు పండించుకుంటూ సంతోషంగా ఉన్నారు. ఇదే వాతావరణం కొనసాగించుకోవడానికి ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలి.

– గంగుల ప్రభాకర్ రెడ్డి

నామినేషన్‌కు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు


ఆర్.నాగులవరం నుంచి ఆళ్లగడ్డకు వాహనాల్లో వెళ్తున్న నాయకులు


దొర్నిపాడు నుంచి నామినేషన్‌కు బయలు దేరిన నాయకులు

దొర్నిపాడు: ఆళ్లగడ్డ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గంగుల బిజేంద్రారెడ్డి నామినేషన్ వేస్తున్న సందర్భంగా బుధవారం మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. అన్ని గ్రామ సచివాలయాల పరిధిల నుంచి కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు తరలివెళ్లారు.

శిరివెళ్ల: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా గంగుల బిజేంద్రారెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఇందుకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఉదయం 9 గంటల నుంచి గ్రామాల వారీగా బైక్, వాహనాల్లో ర్యాలీగా బయలుదేరారు. శిరివెళ్ల, గోవిందపల్లె, యర్రగుంట్ల, వీరారెడ్డిపల్లె, కోటపాడు, బోయలకుంట్ల, మహదేవపురం, గుంప్రమాన్‌దిన్నె, జీనేపల్లె, వనికినిదిన్నె, చెన్నూరు, గుండంపాడు గ్రామాల నాయకుల ఆధ్వర్యంలోలో కార్యకర్తలు తరలివెళ్లారు.


శిరివెళ్ల నుంచి నామినేషన్‌కు తరలిన కార్యకర్తలు

బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు


నామినేషన్ వేస్తున్న సీనియర్ న్యాయవాది జీవీఎస్ ప్రసాద్

నంద్యాల(వ్యవసాయం): పట్టణ బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం బార్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ కోలాహలంగా సాగింది. ప్రెసిడెంట్ స్థానానికి సీనియర్ న్యాయవాదులు దుర్గాప్రసాద్, జీవీఎస్ ప్రసాద్, నందీశ్వరరెడ్డి నామినేషన్ వేశారు. వైస్ ప్రెసిడెంట్లుగా పీడీ హుసేన్‌బాబు, పాణ్యం శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా, జనరల్ సెక్రటరీగా కోటపాడు శ్రీనివాసులు భూపని వెంకటేశ్వర్లు జాయింట్ సెక్రటరీగా రామకృష్ణ, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీగా చిన్నలింగయ్య, భూమా వెంకటరెడ్డి, లైబ్రరీ సెక్రటరీగా జీవన్‌రాజు, శేషసాయి, ట్రెజరర్‌గా మద్దిలేటిరెడ్డి నామినేషన్లు వేశారు. బార్ అసోసియేషన్‌లో 400మంది న్యాయవాదులు సభ్యులుగా ఉన్నారని, ఎన్నికల కమిటీ సభ్యులు రామకృష్ణయ్య, సుధాంశరెడ్డి, రఘుప్రకాష్ తెలిపారు. 25వ తేదీన ఉపసంహరణ, 27న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.